క్లుప్తంగా

జెడ్పీ సీఈఓ విచారణ



జడ్చర్ల టౌన్‌: మండలంలోని పోలేపల్లి ఫార్మసెజ్‌లోని 458, 459 సర్వేనెంబర్లలో భూ నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై శనివారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి విచారణ చేపట్టారు. స్థలాలను రియల్‌ వ్యాపారి కొనుగోలు చేసి ఎలాంటి నిర్మాణాలు జరపకుండానే ఇంటి నెంబర్లు తీసుకున్నారని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు విచారణకు వచ్చారు. నిర్వాసితుల ప్లాట్లు కొనుగోలు చేయడం నేరమని, అదేవిధంగా తప్పుడు పత్రాలు సృష్టించి నిర్మాణాలు ఉన్నట్లుగా మోసం చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నిర్వాసితుల స్థలాలతోపాటు ఇంటి నెంబర్లు కేటాయించిన ప్లాట్లను పరిశీలించారు. నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తానని ప్రకటించారు. ఆయనవెంట ఎంపీడీఓ విజయ్‌కుమార్‌, ఎంపీఓ సరోజ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ ఉన్నారు.

‘డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వండి’

దేవరకద్ర: మహబూబ్‌నగర్‌ జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ టీపీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శనివారం ఏఐసీసీ పరిశీలకుడు నారాయణ స్వామిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

రోడ్డు పక్కన విక్రయిస్తే కఠిన చర్యలు

భూత్పూర్‌: దీపావళి సందర్భంగా భూత్పూర్‌ చౌరస్తాలోని వ్యాపారులు తమ దుకాణాల ఎదుట టపాకాయలు విక్రయిస్తే చర్యలు తీసుకొంటామని కమిషనర్‌ నూరుల్‌ నజీబ్‌ ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల వెళ్లేదారిలోని ఊరచెరువు వద్ద ట్యాంక్‌బండ్‌పై టపాసులు విక్రయించడానికి స్థలం కేటాయించామని, అక్కడే దుకాణాలను పెట్టుకోవాలని సూచించారు. దుకాణాల ఎదుట టపాసులు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

భద్రతాప్రమాణాలు పాటించాలి

నవాబుపేట: భద్రతా ప్రమాణాలు పాటిస్తేనే టపాకాయలు దుకాణాలకు అనుమతి ఇస్తామని ఎస్‌ఐ విక్రమ్‌ తెలిపారు. శనివారం ఆయన వ్యాపార సంఘం అధ్యక్షుడు సుధాకర్‌ తదితర వ్యాపారులతో మాట్లాడారు. టపాకాయల దుకాణాలు జనవాసాల మధ్య విక్రయించడం నిషేధమన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌ యార్డు ఆవరణలో భద్రతా ప్రమాణాలతో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిస్తున్నట్లు తెలిపారు. దుకాణాల చెంత వాటర్‌ ట్యాంకర్‌ తదితర ఏర్పాట్లు చేసుకుని పంచాయతీ అనుమతి పొందాలన్నారు. ఆదివారం నుంచి సోమవారం వరకు మార్కెట్‌లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు వ్యాపార సంఘం నాయకులు సుధాకర్‌, యాదయ్య, శేఖర్‌ తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



నవాబుపేట:కేజీబీవీ విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల స్పెషల్‌ అధికారి సునీత సూచించారు. శనివారం ఆమె మండల అధికారులతో కలిసి కేజీబీవీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. వందశాతం ఉతీర్ణత సాధించాలని ప్రతి సబ్జెక్టులో వంద మార్కులు టార్గెట్‌గా చదవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ జయరాంనాయక్‌ ఉన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

అడ్డాకుల: మండలంలోని కందూర్‌ శివారులో స్వయంభూగా వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక రామయ్యగుట్టపై అక్రమంగా మైనింగ్‌ చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కందూర్‌ మాజీ సర్పంచ్‌ శ్రీకాంత్‌, శ్రీనివాస్‌యాదవ్‌, చంద్రమౌళి, రమేశ్‌ శనివారం మైనింగ్‌ జరిగిన గుట్టను పరిశీలించారు. గుట్టపై ఉన్న పెద్దపెద్ద రాళ్లను బ్లాస్టింగ్‌ చేసి తొలగించడాన్ని తప్పుబట్టారు. అధికారుల అనుమతి లేకుండా మైనింగ్‌ చేపట్టిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

కరాటే బెల్ట్‌లు ప్రదానం

జడ్చర్ల: మండలంలోని గీతశ్రీ ఉన్న పాఠశాలలో శనివారం కరాటే విద్యార్థులకు బెల్ట్‌, గ్రేడింగ్‌ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, బాల్‌రాజ్‌, జాకీర్‌, ఇంతియాజ్‌ పాల్గొన్నారు.





అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



జిల్లాకేంద్రంలో షాపులను మూసివేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



ఆర్టీసీ బస్టాండ్‌ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రిజర్వేషన్‌ సాధనే లక్ష్యం



పీయూ మెయిన్‌ గేట్‌ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు



భూత్పూర్‌ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌ నాయకులు



బాదేపల్లి రైల్వేబ్రిడ్జిపై రాస్తారోకో చేస్తున్న జేఏసీ నాయకులు



మూసాపేటలో పాల్గొన్న కాంగ్రెస్‌ పార్టీ నాయకులు



నవాబుపేటలో బీఆర్‌ఎస్‌ నాయకుల బైక్‌ర్యాలీ



దేవరకద్రలో బంద్‌లో పాల్గొని నినాదాలు చేస్తున్న అఖిల పక్ష నాయకులు



అడ్డాకులలో షాపులను మూసి వేయిస్తున్న నాయకులు



జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌ వద్ద నిరసన తెలుపుతున్న అఖిలభారత యాదవ మహాసభ నాయకులు



ఆర్టీసీ బస్టాండ్‌ ఎదుట బీసీ నాయకుల బైఠాయింపు

- బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో, మానవహారం
- మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు
- స్వచ్ఛందంగా బంద్‌ పాటించిన దుకాణా సముదాయాలు, ప్రైవేట్‌ విద్యాసంస్థలు

సాక్షి నెట్‌వర్క్‌ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్‌ జడ్చర్లలో విజయవంతమైంది. బంద్‌ సందర్భంగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో దుకాణాలు, వ్యాపార సంస్థలు, హోటళ్లు, విద్యా సంస్థలు మూసి వేయించారు. ప్రైవేట్‌ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌ పాటించాయి. ప్రభుత్వ విద్యా సంస్థలను ఆందోళనకారులు మూసివేయించారు. ఆర్టీసీ బస్సులు ఆయా డిపోల నుంచి బయటకు రాకపోవడంతో అడపాదడపా రాయలసీమ బస్సులు మాత్రమే రోడ్లపై కనిపించాయి. బంద్‌ సందర్భంగా తెల్లవారుజామున పోలేపల్లి ఫార్మసెజ్‌కు వెళ్తున్న బస్సులను అడ్డుకున్నారు. చాలాసేపు అడ్డుకున్న తర్వాత ఉద్యోగులను ఇళ్లకు పంపించి వాటిని వదిలేశారు. పట్టణంలోని రైల్వేబ్రిడ్జిపై రాస్తారోకో నిర్వహించడంతో అటు కల్వకుర్తి, ఇటు నేతాజీ చౌరస్తా, ఫ్లెఓవర్‌ వైపు పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని రాస్తారోకోను విరమింపజేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్‌ వాహనాలపై ఆధారపడాల్సి వచ్చింది. ముఖ్యకూడళ్లు రద్దీగా మారాయి. బస్సులు లేక జడ్చర్ల బస్టాండ్‌ నిర్మానుష్యంగా మారింది. బంద్‌లో భాగంగా బైక్‌ ర్యాలీలు నిర్వహించారు. బంద్‌లో బీసీ జేఏసీ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పుష్పలత పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ సిగ్నల్‌గడ్డపై కొద్దిసేపు ధర్నాలో పాల్గొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్‌ చేశారు. బంద్‌ను పురస్కరించుకుని ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు. ఎస్పీ జానకి ఫ్లెఓవర్‌ వద్దకు చేరుకుని బంద్‌ పరిస్థితులపై సమీక్షించారు. సిగ్నల్‌గడ్డపై ఉన్న ఓ మార్ట్‌ తెరిచి ఉందని ఆందోళనకారుడు రాళ్లు రువ్వడం విమర్శలకు దారితీసింది.

- పీయూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పీయూలోని తరగతి గదులను బీసీ జేఏసీ చైర్మన్‌ బెక్కం జనార్దన్‌ ఆధ్వర్యంలో మూసివేసి పరీక్షలను బహిష్కరించారు. ఫార్మసీ బ్లాక్‌ నుంచి మెయిన్‌ గేట్‌ వరకు ర్యాలీ నిర్వహించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు.
- బీసీ జేఏసీ బంద్‌కు బీటీఎఫ్‌ సంపూర్ణ మద్దతు పలికింది. కొత్తబస్టాండ్‌ ఎదుట సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.
- నవాబుపేటలో శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ నాయకులు అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్‌ నాయకులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ నాయకులు పెద్దెత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.
- దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో అన్ని రాజకీయ పార్టీలతోపాటు ప్రజా సంఘాలు ఉదయం నుంచి బైక్‌లపై తిరుగుతూ బంద్‌ను పర్యవేక్షించారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు నినాదాలు చేశారు. కొకుంట్లతోపాటు పేరూర్‌లో అఖిలపక్ష నాయకులు పార్టీ జెండాలు పట్టుకుని బంద్‌లో పాల్గొన్నారు. పాల్గొన్నారు.
- భూత్పూర్‌లో ఉదయం నుంచే వ్యాపార సముదాయాలు, హోటళ్లు, ఇతర వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌ పాటించారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.
- గండేడ్‌ మండల కేంద్రంలో ఉదయం నుంచే అఖిల పక్ష నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచి ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు రాములు, బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు పెంట్యానాయక్‌ పాల్గొన్నారు.
- మహమ్మదాబాద్‌ చౌరస్తాలో అఖిలపక్ష నాయకులు ధర్నా చేపట్టారు. ప్రైవేట్‌ వాహనాలు ట్రాన్స్‌ఫోర్ట్‌, చిన్న చిన్న వాహనాలు తప్పా ఆర్టీసీ బస్సులు రోడ్డుపైకి రాలేదు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు బంద్‌కు సహకరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్‌ కార్యదర్శి రాములు, కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, బీజేపీ అధ్యక్షుడు నర్సింహులు, రాజేశ్వర్‌, భిక్షపతి, మాజీ ఎంపీపీ శాంతీబాయి, మాజీ వైస్‌ఎంపీపీ రాధారెడ్డి పాల్గొన్నారు.
- మిడ్జిల్‌ మండల కేంద్రంలో కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొని తమ మద్దతు తెలిపాయి. బైక్‌ ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు పులిరాజుకు వినతిపత్రం అందజేశారు.
- చిన్నచింతకుంటలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో బంద్‌ చేపట్టిన బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. నాయకులు ర్యాలీ నిర్వమించి దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్‌ కార్యాలయాలు మూయించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వ రమేశ్‌, మాజీ ప్రధాన కార్యదర్శి నంబిరాజు, సీపీఐ జిల్లా నాయకుడు దేవదానం, బీఆర్‌ఎస్‌ నాయకుడు మోహన్‌గౌడ్‌, కాంగ్రెస్‌ నాయకుడు వెంకటేశ్‌, బీసీ నాయకులు పాల్గొన్నారు.
- మూసాపేట, అడ్డాకుల మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కిరాణా షాపులు, హోటళ్లను కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు మూసి వేయించారు.



మహమ్మదాబాద్‌లో అఖిలపక్షం నాయకుల మానవహారం



చిన్నచింతకుంటలో ర్యాలీగా వెళ్తున్న వివిధ పార్టీల నాయకులు



కొకుంట్లలో బంద్‌లో పాల్గొన్న నాయకులు



గండేడ్‌లో ధర్నాలో పాల్గొన్న అన్నిపార్టీల నాయకులు



మిడ్జిల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



జడ్చర్ల ఫ్లైఓవర్‌ వద్ద కాంగ్రెస్‌ నాయకుల నిరసన

రాంరెడ్డిగూడెం వద్ద ఫిల్టర్‌బెడ్ల పరిశీలన

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: నగర పరిధిలోని రాంరెడ్డిగూడెం ఫిల్టర్‌ బెడ్‌ను శనివారం అదనపు కలెక్టర్‌ శివేంద్రప్రతాప్‌ తనిఖీ చేశారు. నగరానికి ఇక్కడి నుంచి తాగునీరు పంపింగ్‌ చేయడానికి ఇక్కడ ఎన్ని మోటర్లు ఉన్నాయో ఆరా తీశారు. మొత్తం మూడింటిలో రెండు పనిచేస్తున్నాయని, మరొకటి మరమ్మతుకు గురైందని మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ అధికారులు బదులిచ్చారు. దానిని వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. అనంతరం నీటిశుద్ధి చేసే ప్లాంటు, ఆరుబయట మెయిన్‌ పైపులైన్‌కు మరమ్మతు చేసిన చోట క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో నగర కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఈఈ విజయ్‌కుమార్‌, ఏఈలు నుస్రత్‌, రాగవినతి తదితరులు పాల్గొన్నారు.



మెయిన్‌ పైపులైన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ శివేంద్రప్రతాప్‌

విద్యుత్‌ సమస్యల పరిష్కారానికే ప్రజాబాట

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): విద్యుత్‌సమస్యల పరిష్కారానికే ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌ కో డీఈ లక్ష్మన్‌నాయక్‌ అన్నారు. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో తలెత్తే విద్యుత్‌ సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. షాషాబ్‌ గుట్ట, పాల్‌సాబ్‌గుట్ట ప్రాంతాల్లో పర్యటించిన ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. లో ఓల్టేజీ సమస్య నివారించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్‌ టౌన్‌ ఏడీ థావుర్యానాయక్‌, విద్యుత్‌ సిబ్బంది, కాంగ్రెస్‌ నాయకలు ప్రవీన్‌, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్‌ శాఖ డీఈ లక్ష్మన్‌నాయక్‌, ఏడీ థావుర్యానాయక్‌

1నుంచి క్విజ్‌ పోటీలు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: భారత్‌ వికాస్‌ పరిషత్‌ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు భారత్‌ కో జానో క్విజ్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు భూషణ్‌ పాండే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీవీపీ కార్యాలయంలో శనివారం జరిగిన సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 1వ తేదీన పాఠశాలల్లో రాతపూర్వక క్విజ్‌ పోటీలు, 4న జిల్లా స్థాయిలో మౌఖిక క్విజ్‌ పోటీలు ఉంటాయని తెలిపారు. 6, 7, 8 తరగతులు జూనియర్‌, 9, 10 తరగతులు సీనియర్‌గా వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు.

జేపీఎన్‌సీఈలో ముగిసిన శిక్షణ

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: ధర్మాపూర్‌ శివారులోని జేపీఎన్‌సీఈలో సీఎస్‌ఈ విద్యార్థులకు ‘బిగ్‌ డేటా అండ్‌ క్లౌడ్‌ కంప్యూటింగ్‌ అప్లికేషన్స్‌-ట్రెండ్స్‌’పై ఇస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. దీనిని సాధారణ పరిస్థితుల్లో ఎలా ఉపయోగించాలో ఇన్ఫోసిస్‌ సీనియర్‌ సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ కార్తీక్‌కుమార్‌ వివరించారు. ఇందులో కార్యక్రమ కో- ఆర్డినేటర్‌ కృష్ణమూర్తి, కో కో-ఆర్డినేటర్‌ స్వాతి, సీఎస్‌ఈ విభాగాధిపతులు గురు రాఘవేంద్రారెడ్డి, జమున, రాధిక పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జడ్చర్ల టౌన్‌: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జడ్చర్ల మండల న్యాయసేవాసంస్థ చైర్మన్‌, ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి నిహారిక పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని శనివారం కావేరమ్మపేట మైనార్టీ బాలికల రెసిడెన్షియల్‌ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి ముద్దసిర్‌, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మాలిక్‌షాకీర్‌, న్యాయవాదులు సాహితిరెడ్డి, విశ్వేశ్వర్‌, ప్రశాంత్‌ కుమార్‌, శంకరాచారి, పురుషోత్తంరావు, పాండు కుమార్‌, రాములు,అబ్దుల్‌రవూఫ్‌, ప్రిన్సిపాల్‌ కల్పన, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



డిగ్రీ, పీజీ కళాశాలలో క్యాంపస్‌ ఏకో బజార్‌



విజేతలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ జానకి



ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ, ప్రిన్సిపాళ్లు

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం కళాశాల ఏకో క్లబ్‌, భారత పర్యావరణ అటవీ వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ నేషనల్‌ గ్రీన్‌ క్రాప్స్‌ సహకారంతో క్యాంపస్‌ ఏకో బజార్‌ నిర్వహించారు. ఏకో బజార్‌లో పర్యావరణహిత వ్యాపారాలు ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. ఏకో బజార్‌లో 51స్టాళ్లు ఏర్పాటు చేశారు. గ్రీన్‌ఫుడ్‌ స్టాల్స్‌, పునర్వినియోగ కళాత్మక నమూనాలు, పునరుత్పాదక శక్తి మోడల్స్‌, సంప్రదాయ ఉత్పత్తులు, పిండి వంటలు, గృహోపకరణ ఉత్పత్తులు ఏకో బజార్‌లో ప్రదర్శించారు. ఏకో బజార్‌ను ఎంఈఓ మంజులాదేవి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. న్యాయనిర్ణేతలుగా శిల్ప, కిరణ్మయి వ్యవహరించారు.

బహుమతులు అందజేసిన ఎస్పీ

ఏకో బజార్‌ను ఎస్పీ జానకి సందర్శించి విద్యార్థులను అభినందించారు. విజేతలకు బహుమతులు అందించి ప్రశంసించారు.ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిబాబు, సీఐ కమలాకర్‌, కళాశాల ప్రిన్సిపాల్‌ సుకన్య, ఏకో క్లబ్‌ కన్వీనర్‌ ఇస్రత్‌ సుల్తాన, సమన్వయకర్త సదాశివయ్య, సభ్యులు మాధురి, రాజేశ్వరి, ప్రవీణ్‌, రాఘవేంద్రరెడ్డి, లత,విక్రం,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ సమీపంలో శనివారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. అలంపూర్‌ సమీపంలోని లింగనవాయికి చెందిన రాములు హైదరాబాద్‌ నుంచి బైక్‌పై స్వస్థలానికి వెళ్తున్నాడు. అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌ దాటిన తర్వాత సర్వీస్‌ రోడ్డుపై నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్‌ డ్రైవర్‌ బైక్‌ ముందు హైవేపైకి ఎక్కించాడు. రాములు బైక్‌ను కంట్రోల్‌ చేయలేక ట్రాక్టర్‌ ట్రాలీ వెనుక ఢీకొట్టుకోవడంతో తల, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ తప్పించుకుని పోయింది. బాధితుడు బైక్‌పై పీహెచ్‌సీకి వచ్చి ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌ వెంటనే కానిస్టేబుళ్లు చెన్నయ్య, రాహుల్‌ను పంపించి బాధితుడిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి పంపించి బంధువులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

జడ్చర్ల: కల్వకుర్తి ప్రధాన రహదారిపై శనివారం ట్రాక్టర్‌, బైక్‌ ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ఉన్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఏనుగొండ ఎస్వీఎస్‌ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి పెబ్బేరుకు చెందిన తిరుపతిగా గుర్తించారు.